సాక్షి
సూర్యాపేట

ఆదివారం : 17 : సెప్టెంబర్ : 2023



మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మూసీకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు. - 4లో



మోసం చేస్తున్న మోదీ, కేసీఆర్

మోదీ, కేసీఆర్ దొందూ.. దొందేనని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. - 4లో



సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తి

నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడిన వ్యక్తి ఓరుగంటి రాములు అని హరియాణా గవర్నర్ దత్తాత్రేయ అన్నారు. - 4లో

న్యూస్‌రీల్

నేడు తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం

- జాతీయ జెండా ఆవిష్కరించనున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : నూతన కలెక్టరేట్ ఆవరణలో ఆదివారం తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాట్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో ఉదయం 9 గంటలకు మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని చెప్పారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తాం



తిరుమలగిరిలో పోరెళ్ల దాసు స్థూపం ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న సంకినేని

తిరుమలగిరి (తుంగతుర్తి) : బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం తెలంగాణ సాయుధ పోరాట యోధులు పోరెళ్ల దాసు, బండి యాదగిరి స్మారక స్థూపాలను తిరుమలగిరిలో ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దొరలు, దేశ్‌ముఖ్‌లు, నిజాంకు వ్యతిరేకంగా వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన ఘనత పోరెళ్ల దాసు, బండి యాదగిరిలది అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ల్యాండ్, శాండ్ మాఫియా సాగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, పేరాల పూలమ్మ, శోభారాణి, కాప రవి, హన్మంతు, బంగార్రాజు, పోరెళ్ల దాస్ కుటుంబ సభ్యులు లక్ష్మమ్మ, సత్తమ్మ, సోమయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట ఆర్టీసీ డిపోలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం డిపో ఎదుట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి ఉప్పు లక్ష్మయ్య సంఘం పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్టీసీ, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడకుండా కార్మిక సంఘాలు తమలో తామే కొట్లాడుకునే పరిస్థితిని అధిగమించి అందరినీ ఐక్యం చేయడమే లక్ష్యంగా 1979లో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏర్పాటైందన్నారు. నాటినుండి కార్మికుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తూ రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, ఇంద్రయ్య, పరుశరాములు, సైదులు, శీను, యాకమ్మ పాల్గొన్నారు.

రేపు సూర్యాపేట మార్కెట్‌కు సెలవు

భానుపురి (సూర్యాపేట) : వినాయక చవితి సందర్భంగా సోమవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయానికి సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎండి ఫషీయుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించి మార్కెట్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పోటీలతో మేధస్సు పెంపు

సూర్యాపేటటౌన్ : పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో మేధస్సు పెరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో శనివారం జిల్లా స్థాయి సదరన్ ఇండియా సైన్స్ డ్రామా పోటీలు–2023 నిర్వహించారు. ఈ సందర్భంగా 'చిరుధాన్యాలు– సంపూర్ణ ఆహారం', 'ఆహార భద్రత', 'నిత్య జీవితంలోఆధునిక పరిజ్ఞానం', 'సమాజంలో మూఢనమ్మకాలు' అనే నాలుగు అంశాలపై విద్యార్థులకు డ్రామా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



75 ఏళ్ల మహో సంగ్రామం

తెలంగాణ సాయుధ పోరాటం ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలనకు వ్యతిరేకంగా మహోజ్వలంగా సాగింది. గెరిల్లా పోరాటం 1946 జూలై 4న మొదలైంది. ఉధృతంగా సాగిన ఈ పోరాటంలో పూర్వపు నల్లగొండ జిల్లా అగ్రభాగాన నిలిచింది. తిన తిండి లేనివారు.. వెట్టిచాకిరీలో మగ్గినవారు.. 'దొరా..బాంచెన్ నీ కాల్మొక్తా' అన్న వారు.. వీరులై, శూరులై భగభగ మండే సూర్యులై బందూకులు చేతబట్టారు. నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల దురాగతాలకు కడుపు మండిన కూలి జనం సాయుధ పోరాటం రాజేసింద్రు. చివరకు 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్ సంస్థానాన్ని చుట్టుముట్టిన సర్దార్ వల్లభాయ్ పటేల్ సైన్యం మూడున్నర రోజుల్లో నిజాం రాజు మెడలు వంచింది. 1948, సెప్టెంబరు 17న నిజాం నవాబు భారత ప్రభుత్వానికి లొంగిపోయాడు. హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో కలవడంతో సాయుధ పోరాటానికి తాత్కాలిక విరామం ప్రకటించినా.. కమ్యూనిస్టులు 1951 సంవత్సరం వరకు పోరాటం కొనసాగించారు. 1951 అక్టోబర్ 21వ తేదీన సాయుధ పోరాటం ఉపసంహరించుకున్నట్లు చరిత్ర చెబుతున్నది. అయితే, నిజాం నవాబు లొంగిపోయిన రోజునే హైదరాబాద్ రాష్ట్ర వియోచన దినంగా జరుపుకుంటున్నారు.



తెలంగాణ సాయుధ పోరాట ఘట్టాలపై ప్రత్యేక కథనాలు –2లో

ఏడు దశాబ్దాలుగా సాగులో ఉన్నా..

హక్కులు లేవు!

- భూస్వాముల నుంచి కొనుగోలు చేసిన వారు కొందరు.. 'ఇనాం'గా పొందిన మరికొందరు
- మౌఖికంగా, సాదా కాగితాలపైనే వందల ఎకరాల భూ మార్పిడి
- వీరికిచ్చిన భూములనే 'సీలింగ్ యాక్ట్'లో మిగులుగా చూపిన భూస్వాములు
- రైతులకు పట్టాలు లేకపోవడంతో రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా గుర్తింపు
- పట్టాలు లేక పథకాలకు దూరం
- కోర్టులను ఆశ్రయించిన కొందరు రైతులు

భూమి..భుక్తి..విముక్తి నినాదంతోనే తెలంగాణ సాయుధ పోరాటం సాగింది. రాచరికం పోయి.. ప్రజారాజ్యం ఏర్పడినప్పటికీ దున్నేవాడికి భూమి దక్కలేదు. కొన్నేళ్లుగా భూములను సాగుచేసుకుంటున్నా వాటిపై వారికి హక్కులు లేవు. తరాలు గడిచిపోతున్నా వారి గోడు పట్టించుకునే వారు లేరు. ఇప్పటికీ ఆ రైతులు తమ భూముల పట్టాల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ప్రభుత్వం కాస్త స్పందించినా వారికి స్వాంతన చేకూరుతుంది.

– సాక్షి, నల్లగొండ డెస్క్

కోర్టు తీర్పును పట్టించుకోవడం లేదు



మా తాతల కాలంలో జెన్నారెడ్డి భూస్వాముల దగ్గర కొనుగోలు చేసిన భూములు నేటికీ పట్టాలు కాలేదు. సాగులో ఉన్నప్పటికీ పట్టాలు ఇవ్వకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నాం. 2020లో కోర్టుకు వెళ్లగా విచారణ అనంతరం కోర్టుకు వెళ్లిన రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కోర్టు ఆదేశించినప్పటికీ నేటి వరకు స్థానిక అధికారులు పట్టాలు మంజూరు చేయలేదు.

– భీమిడి నారాయణరెడ్డి, నూతనకల్



ఈ చిత్రంలో కనిపిస్తున్న భూమి నూతనకల్ మండలం చిల్పకుంట్లలో సర్వే నంబర్ 52 లోనిది. ఈ ఆరెకరాల భూమిని గ్రామానికి చెందిన కనకయ్య 1957లో భూ స్వాముల వద్ద కొనుగోలు చేశాడు. అప్పట్లో రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. దీంతో ఇప్పుడు ధరణి పోర్టల్‌లో భూస్వామి జన్నారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి పేరునే ఆ భూమి ఉంది.

ఉమ్మడి నూతనకల్ మండలంలో దాదాపు 70 ఏళ్ల క్రితం దేశ్‌ముఖ్‌ల నుంచి భూములు కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్న రైతులకు నేటికీ పట్టాలు రాలేదు. ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన దేశ్‌ముఖ్ జెన్నారెడ్డి ప్రతాప్‌రెడ్డికి వేల ఎకరాల భూములు ఉండేవి. ఆయన వారసులైన జెన్నారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, జెన్నారెడ్డి సుధీర్‌రెడ్డి 1952లో కొంత భూమిని చుట్టుపక్కల గ్రామాల రైతులకు విక్రయించినట్లు స్థానికులు చెప్పారు. ఆ తర్వాత భూదానోద్యమ సమయంలో 1954, 1959 మధ్య కాలంలో వివిధ గ్రామాలకు చెందిన కొంత మందికి దాదాపు రెండు వేల ఎకరాలను ఉచితంగా పంపిణీ చేశారు. అయితే, ఈ భూస్వాముల వద్ద కొనుగోలు చేసిన రైతులు గానీ, ఉచితంగా పొందిన వారు గానీ పట్టాలు చేసుకోలేదు. నిజాం నవాబు లొంగిపోయిన తర్వాత హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం రక్షిత కౌలుదారు చట్టం (టెనెన్సీ యాక్టు) తీసుకువచ్చింది. ఖాస్రా పహాణీలో ఎవరి పేరు నమోదై ఉంటుందో వారికే పట్టాలు ఇవ్వాలని నిర్ణయించింది. అయితే, దేశ్‌ముఖ్‌ల నుంచి భూములు పొందిన వారిలో చాలా మంది ఖాస్రా పహాణీలో పేరు నమోదు చేసుకోలేదు. అక్కడక్కడ భూస్వాములు భూములను విక్రయిస్తున్నారని, వాటికి అడ్డుకట్ట వేసేందుకు భారత ప్రభుత్వం 1972లో సీలింగ్ యాక్టు తీసుకువచ్చింది. అదే సమయంలో భూముల రిజిస్ట్రేషన్‌ను కూడా నిలిపివేసింది.

మామిడి తోటలకు మినహాయింపు

సీలింగ్ యాక్టు ప్రకారం ప్రభుత్వం మిగులు భూములను అప్పగించాల్సిందిగా భూస్వాములను కోరింది. ఆ రోజుల్లో దేశ్‌ముఖ్‌లకు భూములు వేల ఎకరాలు ఉండేవి. ప్రభుత్వం భూ సీలింగ్ యాక్ట్ తెస్తుందని ముందే గ్రహించిన కొందరు తమ భూముల్లో మామిడి తోటలు వేశారు. అప్పట్లో తోటలు ఉన్న భూములకు ప్రభుత్వం సీలింగ్ యాక్ట్ నుంచి ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. తోటలు వేయడంతో పాటు కొంత భూమిని విక్రయించారు. వీరి వద్ద భూములను కొనుగోలు చేసిన వారు, ఇనాంగా పొందిన వారు పట్టాలు చేసుకోకపోవడంతో రికార్డుల్లో భూస్వాముల పేర్లే నమోదై ఉన్నాయి. దీంతో భూ స్వాములు తాము విక్రయించిన భూములనే మిగులు భూములుగా చూపించి ప్రభుత్వానికి అప్పగించారు. ప్రభుత్వం ఆ భూములను సీలింగ్ యాక్ట్ కింద నోటిపై చేసింది. అప్పటి నుంచి రికార్డుల్లో ప్రభుత్వ భూములుగానే ఉన్నాయి. దీనిపై కోర్టులో కూడా కేసులు నడిచాయి. ఆ భూములను సీలింగ్ కింద ఇచ్చానని కోర్టులో సదరు భూస్వామి వాంగ్మూలం ఇచ్చాడు. కానీ ప్రభుత్వం ఆ భూముల మీదికి రాలేదు. ఇప్పుడు కూడా రైతులే సాగు చేసుకుంటున్నారు. అయితే ధరణి పోర్టల్ రాకముందు కాస్తు కాలంలో రైతుల పేర్లు ఉండేవి. ధరణి వచ్చాక పట్టేదారు కాలంలో భూస్వామి పేరు వస్తోంది.

పట్టా చేయాలని కోర్టు తీర్పు..

2020లో 227 మంది రైతులు తమకు భూములను పట్టాలు చేయాలని కోరుతూ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ కోర్టుకు వెళ్లగా 638 ఎకరాలకు పట్టాలు ఇవ్వాలని కోర్టు ఆదేశాలు జారీచేసింది. అది నేటికీ అమలు కాలేదు. కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ అధికారులు అందులో 150 ఎకరాలు అసైన్డ్ భూములుగా గుర్తించారు. ఏళ్ల క్రితం కొనుగోలు చేశామని పట్టాలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందలేకపోతున్నామని రైతులు, వారి వారసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1400 ఎకరాలకు పైగా పట్టాలు లేవు

ఉమ్మడి నూతనకల్ మండలంలోని నూతనకల్, చిల్పకుంట్ల, పెదనెమిల, పోలుమల్ల, ఎర్రపహాడ్, దిర్శనపల్లి, గుండ్లసింగారం, ఎడవెల్లి, చందుపట్ల, ముకుందాపురం గ్రామాల్లో సుమారు 1400 ఎకరాల కోసం 70 ఏళ్లుగా రైతులు పట్టాల కోసం పోరాడుతున్నారు. సాగులో ఉన్న వారికే పట్టాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. దీనిపై భూస్వాముల నుంచి కూడా అభ్యంతరం ఏమీలేదు. ఎర్రపహాడ్‌లో కొంత మంది రైతులకు ఇటీవల వరకు భూస్వాములు రిజిస్ట్రేషన్ చేశారు. ప్రభుత్వ భూములుగా నమోదై ఉన్న భూములే రిజిస్ట్రేషన్ కావడం లేదు.

చలో తుక్కుగూడ

కాంగ్రెస్ విజయభేరి సభకు ఉమ్మడి జిల్లా నుంచి భారీగా పార్టీ శ్రేణులు

- ఇద్దరు ఎంపీల నేతృత్వంలో తరలివెళ్లేలా ఏర్పాట్లు
- సొంత, ప్రైవేట్ వాహనాల్లో తరలింపు
- 297 ఆర్టీసీ బస్సులు సైతం బుక్ చేసిన పార్టీ
- నియోజకవర్గానికి 5 వేల మంది వెళ్లేలా సమాయత్తం



సన్నాహక సమావేశంలో పాల్గొన్న నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, ఇతర నేతలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఈనెల 17వ తేదీన తుక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించే విజయభేరి సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. అధినేత్రి సోనియాగాంధీతో పాటు అగ్ర నాయకులు ఈ సమావేశానికి హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి నియోజకవర్గానికి ఒక ఇన్‌చార్జిని నియమించి ఇప్పటికే సన్నాహక సమావేశాలను సైతం పార్టీ నిర్వహించింది. ముఖ్యంగా ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల నేతృత్వంలో భారీగా కార్యకర్తలు తరలివెళ్లేలా నియోజకవర్గాల్లో నాయకులు ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు, సొంత వాహనాల్లో తరలివెళ్లేలా ప్రణాళిక రూపొందించుకున్నారు.

బల నిరూపణపై ఆశావహుల దృష్టి

విజయభేరి సభ సందర్భంగా నియోజవర్గాల్లో తమ బలాన్ని నిరూపించుకునేందుకు ఆశావహులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో పార్టీ టికెట్ కావాలంటూ అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్న ఆశావహులు ఈ సభ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తమ సత్తా చాటేందుకు పోటీ పడి వాహనాలను ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన జిట్టా బాలకృష్ణారెడ్డి విజయభేరి సభ విజయవంతానికి పెద్ద ఎత్తున వాహనాలను ఏర్పాటు చేశారు. కోమటిరెడ్డి సూచనల మేరకు ఈ ఏర్పాట్లు చేశారు. మరోవైపు నకిరేకల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం రెండు మూడు రోజుల్లో పార్టీలో చేరబోతున్నారు. అందుకు గ్రీన్‌సిగ్నల్ కూడా వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయన కూడా సభ విజయవంతం కోసం ప్రైవేట్ వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. వీటికి సంబంధించి మూడు రోజుల కిందటి నుంచే నియోజకవర్గాల్లో మండలాల్లోని కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహించారు. పార్టీ శ్రేణులను పెద్ద ఎత్తున తరలించడం ద్వారా నియోజకవర్గంలో తమ బల నిరూపణకు ఆశావహులు ఈ సభను వేదికగా చేసుకున్నారు.

ఒక్కో బస్సులో 50 మంది చొప్పున..

విజయ భేరి సభకు పార్టీ శ్రేణులను తరలించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ 297 ఆర్టీసీ బస్సులను బుక్ చేసింది. ఆ వివరాలను ఆర్టీసీ అధికారులే ప్రకటించారు. దేవరకొండ, నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, యాదగిరిగుట్ట డిపోలకు చెందిన బస్సులను బుక్ చేశారు. ఒక్కో బస్సులో సగటున 50 మంది వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ తెలిపారు. సభ విజయవంతానికి ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం 5 వేల మంది కార్యకర్తలు తరలివెళ్లేలా పార్టీ సమాయత్తం చేసింది.

డిపోల వారీగా కాంగ్రెస్ పార్టీ బుక్ చేసిన బస్సులు..

డిపో	నియోజకవర్గం	బస్సుల సంఖ్య
దేవరకొండ	నాగార్జునసాగర్	20
దేవరకొండ	దేవరకొండ	20
నల్లగొండ	నాగార్జునసాగర్	24
నల్లగొండ	నల్లగొండ	40
మిర్యాలగూడ	మిర్యాలగూడ	35
కోదాడ	కోదాడ	50
సూర్యాపేట	సూర్యాపేట	80
యాదగిరిగుట్ట	ఆలేరు	18
యాదగిరిగుట్ట	భువనగిరి	10
మొత్తం		297

యోధుల స్ఫూర్తితో పోరాడుతాం



ర్యాలీలో పాల్గొన్న జూలకంటి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల స్ఫూర్తితో పోరాడుతామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం చింతలపాలెంలో అమరవీరుల స్థూపం వద్ద జెండా ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్. పాండు, పల్లె వెంకటరెడ్డి, వి. సైదులు, బ్రహ్మం, పాండు, సుందర మాలేశ్వర రెడ్డి, మోహనరెడ్డి, హుస్సేన్, శీలం శ్రీను పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

అర్వపల్లి: విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషిచేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌తో కలిసి శనివారం అర్వపల్లిలోని ఎమ్మార్సీలో విలేకరులతో మాట్లాడారు. విద్యావ్యవస్థ బలపడటానికి పీఆర్‌టీయూ ముందుండి పోరాడుతోందన్నారు. తమ సంఘం పోరాటం వల్లే ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టిందన్నారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఒప్పించడం వల్లే నేడు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటికే ప్రధానోపాధ్యాయుల బదిలీలు పూర్తయ్యాయన్నారు. వీరికి ఆదివారం ఆర్డర్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా జరుగుతోందని తెలిపారు. ఈ షెడ్యూల్‌లోనే పండిట్, పీఈటీలకు ప్రమోషన్లు ఇచ్చేలా చూడాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసినట్లు చెప్పారు. గతంలో ఇచ్చిన మొదటి పీఆర్‌సీ మాదిరిగానే రెండో పీఆర్‌సీ కూడా బాగానే ఉంటుందని ఈ పీఆర్‌సీ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. పాఠశాలల్లో సీఎం కేసీఆర్ అల్పాహార కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేయనున్నట్లు చెప్పారు. పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సైరెడ్డి మల్లారెడ్డి మృతికి సంఘం తరపున సంతాపం తెలిపారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.యల్లయ్య, వి.సైదులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జ్యోతుల చంద్రశేఖర్, సీహెచ్.రామలింగారెడ్డి, జెల్లా ప్రసాద్, జి.చంద్రారెడ్డి, జె.పురుషోత్తం, మధుకర్, వైవీ రావు, ఎం.రాము, సీహెచ్.నాగరాజు, మురళీకృష్ణ , యాకలక్ష్మి, సురేందర్, కరుణాకర్, శేఖర్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, గోపాల్, శ్రీరాములు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి

- ఓటరు జాబితా పరిశీలకురాలు నిర్మల



సూర్యాపేటలో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకురాలు నిర్మల, కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పన చేయాలి ఓటరు జాబితా పరిశీలకురాలు, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖ ప్రభుత్వ కార్యదర్శి కె. నిర్మల సూచించారు. ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవరణపై శనివారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఎస్. వెంకట్రావుతో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ నెల 19 లోపు ఓటరుగా నమోదయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. పార్టీల ప్రతినిధులు చూపిన అభ్యంతరాలపై సత్వరమే చర్యలు చేపట్టాలని సూచించారు. రెండవ విడత ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం సందర్భంగా వచ్చిన దరఖాస్తులు, మార్పులు, చేర్పులను కోరుతూ ఓటర్ల నుంచి సేకరించిన నిర్ణీత నమూనా ఫారాలను, రిజిస్టర్లలో వాటిని నమోదు చేసిన వివరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఓటరు నమోదుపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని, ఇంటింటి సర్వే ద్వారా ఓటరు సవరణ జరగాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు మాట్లాడుతూ జిల్లాలో నాలుగు నియోజక వర్గాలలో కొత్తగా 33 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, అలాగే పేరు మార్పులు కింద 58 కేంద్రాల్లో మార్పులను గుర్తించి చర్యలు తీసుకున్నారు. జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 1,201 ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఆధార్ నమోదు 90 శాతం పూర్తి అయిందన్నారు. ఫామ్ 6 ద్వారా కొత్త ఓటర్‌గా ఇప్పటి వరకు 18,528 మందికి ఓటు హక్కు కల్పించామని, ఫామ్ 7 ద్వారా డబుల్ ఎంట్రీ, శాశ్వతంగా వెళ్లిపోయిన వారి ఓట్లు 1,370 మందివి తొలిగించామని, అలాగే ఫామ్ 8 ద్వారా 3,854 మందికి మార్పులు చేసామన్నారు. జిల్లాలో నాలుగు నియోజక వర్గాల్లో మొత్తం 9,34,406 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్. ప్రియాంక, ఎ. వెంకట్‌రెడ్డి, ఆర్డీఓలు వీరబ్రహ్మచారి, జగదీశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణ, తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

75 ఏళ్ల.. మహా సంగ్రామం

● నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం ● రజాకార్ల ఎదురు కాల్పుల్లో నేలకొరిగిన ఎందరో వీరులు

మల్లారెడ్డిగూడెం వాసుల తిరుగుబాటు


మల్లారెడ్డిగూడెంలోని అమరుల స్మారకస్థూపం

హుజూర్‌నగర్ : తెలంగాణ సాయుధ పోరాట కాలంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా మల్లారెడ్డిగూడెం (ప్రస్తుతం చింతలపాలెం) వాసులు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. నిజాం మిలటరీపై చేసిన తిరుగుబాటులో గ్రామానికి చెందిన ఎనిమిది మంది నేల కొరిగారు. 1946 ప్రాంతంలో హుజూర్‌నగర్ పాత తాలుకాలో దొడ్డా నర్సయ్య, చింతలపూడి రాములు, కోట నారాయణ కమ్యూనిస్టు దళ నాయకులుగా ఉన్నారు. వారి సారథ్యంలో గ్రామాల్లో కమ్యూనిస్టు దళాలు ఏర్పడ్డాయి. ఈ విషయాన్ని రజాకార్లు పసిగట్టారు. 1946 డిసెంబర్1న రజాకార్లు వచ్చి మల్లారెడ్డిగూడెం గ్రామాన్ని చుట్టుముట్టారు. గ్రామస్తులు వారిని ఊళ్లోకి ప్రవేశించకుండా కారం పొట్లాలు, వడిశెలు, రాళ్లు, కర్రలతో ఎదురుదాడికి దిగారు. ఆ సమయంలో జరిగిన కాల్పుల్లో యరబోలు అప్పిరెడ్డి, ముంగి వీరయ్య, నందిరెడ్డి నర్సిరెడ్డి మృతి చెందారు. ఆ తర్వాత కూడా నిజాం సైన్యానికి వ్యతిరేకంగా మల్లారెడ్డిగూడెం వాసుల పోరాటం కొనసాగింది. ఈ క్రమంలో 1948 ఆగస్టులో జరిగిన కాల్పుల్లో కందుల గోపిరెడ్డి, చింతిర్యాల రామస్వామి, 1949 జూలైలో జరిపిన కాల్పుల్లో పేరుపంగు భూషమ్మ, పేరుపంగు తిరపతమ్మ (తోటికోడళ్లు), అలుగుల వీరమ్మ మరణించారు. వీరి పోరాట స్ఫూర్తికి చిహ్నంగా సీపీఐ నాయకులు గ్రామ శివారులో స్థూపం నిర్మించారు. ఏటా సెప్టెంబర్‌లో వారోత్సవాలను నిర్వహించి ఆ అమరవీరులను స్మరించుకుంటున్నారు.

ఊదరబాంబుతో రజాకార్లను తరిమిన బీఎన్ దళం

సూర్యాపేట: శత్రుమూక ఆధునిక ఆయుధాలతో కాల్పులు జరుపుతుండగా.. దళ సభ్యులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఊదరబాంబు పెట్టి చంపక చూస్తరేందిరా అన్న ఓ పండు ముసలి మాట సాయుధ దళాలకు కొండంత అండనిచ్చింది. రజాకార్లను అంతమొందించేందుకు ఉపయోగపడిన ఘటన ఆత్మకూర్ (ఎస్) మండలం కోటపహాడ్ గ్రామంలో జరిగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా సూర్యాపేట తాలూకా కోటపహాడ్ గ్రామంలో 1947 సంవత్సరంలో రజాకార్ల మూకపై భీంరెడ్డి నర్సింహారెడ్డి (బీఎన్) ఆధ్వర్యంలో జరిగిన దాడి అది. ఆయన నాయకత్వంలో రావిపహాడ్, బుర్కచర్ల గుట్టలపై కేడర్‌కు శిక్షణ ఇస్తున్న సమయంలో రావిపహాడ్‌లో నిజాం ముష్కరులు ప్రజలపై దాడులు చేసి కోటపహాడ్‌వైపు వెళ్తున్నారన్న సమాచారం బీఎన్‌కు చేరింది. వెంటనే తన దళాన్ని వేసుకుని కోటపహాడ్ వెళ్లగా..అప్పటికే నిజాం ముష్కరులు గ్రామానికి చెందిన వంగేటి లక్ష్మారెడ్డి రెండతస్తుల ఇంటిపైకి చేరుకొని కాల్పులు ప్రారంభించారు. ఆధునిక ఆయుధాలతో జరుపుతున్న ఈ కాల్పులను బీఎన్ రెడ్డి దళం తట్టుకోలేకపోయింది. ఈ సమయంలో ఓ ముసలమ్మ ఇచ్చిన సలహాతో బీఎన్ వందలాది మంది జనం సహాయంతో గడ్డిమోపుల్లో మిరపకాయలు పెట్టి నిప్పంటించి ఇంటిని చుట్టుముట్టారు. దీంతో నిజాం దళాలకు ఊపిరి సలపని పరిస్థితిలో తమ ప్రాణాలు కాపాడుకునేందుకు రైఫిళ్లను భవనం మీదినుంచి కిందపడేసి నాయకురాలా శరణం.. అంటూ వేడుకున్నారు. ఈ సమయంలో నిజాం కమాండర్.. బీఎన్‌ను శరణు.. శరణు అంటూనే సమీపానికి వచ్చి స్టెన్‌గన్‌ను మడిమ పట్టుకుని బీఎన్‌వైపు తిప్పాడు. ఒకరినొకరు పెనుగులాడారు. చివరకు బీఎన్ కాల్చివేయగా కమాండర్ కుప్పకూలాడు. బీఎన్ తుదిశ్వాస విడిచేదాకా ఈ ఘట్టాన్ని గుర్తుచేసుకునేవారు.



గుండ్రాంపల్లిలోని అమరవీరుల స్థూపం

రజాకార్లకు ఎదురొడ్డిన గుండ్రాంపల్లి

చిట్యాల : రజాకార్ల ఆకృత్యాలకు ఎదురొడ్డి నిలిచింది చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామం. 1946లో సూర్యాపేట తాలుకాలోని వర్ధమానకోటకు చెందిన సయ్యద్ మక్బూల్ తన అక్క నివాసముంటున్న గుండ్రాంపల్లికి వలస వచ్చాడు. బతుకుదెరువు కోసం ఏపూరు గ్రామంలోని గుమ్మి బక్కారెడ్డి వద్ద పనిలో చేరాడు. తర్వాత అతను రజాకార్ల బృందంలో చేరాడు. ఇక అప్పటి నుంచి మక్బూల్ అరాచకాలకు అంతేలేకుండా పోయింది. గుండ్రాంపల్లిలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నివాసం ఉంటూ సాయుధ పోరాటంలో పాల్గొంటున్నవారిని, తనకు అడ్డు వచ్చిన వారిని మక్బూల్ హతమార్చేవాడు. మక్బూల్ అరాచకాలకు వ్యతిరేకంగా గుండ్రాంపల్లిలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు తమ పోరాటాన్ని కొనసాగించారు. ఏపూర్, రెడ్డిబావి, సైదాబాద్, గుండ్లబావి, ఆరెగూడెం, పలివెల, వెలిమినేడు, పెద్దకాపర్తి, చిన్నకాపర్తి, ఎలికట్టె గ్రామాలకు చెందిన యువకులు దళాలుగా ఏర్పడ్డారు. వీరు రజాకార్లకు ఎదురొడ్డి దాడులు చేసేవారు. దీనిని సహించని మక్బూల్ ప్రతి దాడులు చేసేవాడు. ఒకసారి అతని దాడిలో దొరికిన 30 మందిని యువకులను గుండ్రాంపల్లిలో బంధించాడు. వీరందరిని ఎడ్లబండికి కట్టేసి గుండ్రాంపల్లి నడిబొడ్డున గల ప్రస్తుతం ఉన్న మసీదు పక్కన ఉన్న బావిలో పడేసి సజీవ దహనం చేశాడు. వారి జ్ఞాపకార్థం గ్రామంలో స్థూపం నిర్మించారు.

గుర్నాథరెడ్డి నాయకత్వంలో..

గుండ్రాంపల్లిలో జరిగిన యువకుల సజీవ దహన సంఘటనతో పలివెల గ్రామానికి చెందిన కొండవీటి గుర్నాథరెడ్డి నాయకత్వంలో మక్బూల్ నివాసం ఉంటున్న ఇంటిపై దాడి చేసేందుకు దళాలు ప్రణాళికను రూపొందించారు. దీనిని గ్రహించి ఈ దాడి నుంచి మక్బూల్ తప్పించుకున్నాడు. దీంతో దళాల్లో పాల్గొన్న యువకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. మరోసారి దళాలు జరిపిన దాడిలో మక్బూల్ చేతికి గాయం కావడంతో గుర్తు తెలియని ప్రదేశానికి పారిపోయాడు. మక్బూల్‌కు సహకరించిన చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన పాశం పుల్లారెడ్డి, వెలిమినేడు గ్రామానికి చెందిన గడ్డం రామయ్య, సప్పిడి రామయ్య ఇంటిపై దాడి చేసి వారిని హతమార్చారు.

ఆత్మకూర్ అగ్నికెరటం.. గొట్టిముక్కుల గోపాల్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్): 1948 సెప్టెంబర్‌లో యూనియన్ సైన్యాలు గ్రామాల్లోకి ప్రవేశించిన రోజులవి. సాయుధ దళనాయకులను మట్టుపెట్టే కార్యక్రమంలో ఫిరంగి మోతలతో.. బ్రెన్‌గన్ కాల్పులతో వెంటాడుతున్నాయి. ఈ క్రమంలో సాయుధ దళం పాతర్లపహాడ్ కొత్తకుంట కట్టతూము (చిన్నబోడు) దగ్గర రక్షణ తీసుకుంటుంది. ఆ సమయంలో మిలటరీ చుట్టుముట్టింది. మూడు వైపుల నుంచి వస్తున్న కాల్పులను మరింత తెగింపుతో గొట్టిముక్కుల గోపాల్‌రెడ్డి దళం మూడు గంటల పాటు హోరాహోరీగా పోరాడింది. చివరకు గోపాల్‌రెడ్డి పొట్టలోనుంచి వేలాడుతున్న పేగులను చేతబట్టుకొని తుదిశ్వాస విడిచాడు. ఈ గోపాల్‌రెడ్డి ఎవరో కాదు సూర్యాపేట తాలుకా ఆత్మకూర్‌లో జన్మించిన వీరుడు. గోపాల్‌రెడ్డి మరణించలేదు.. బతికే ఉన్నాడు.. ఖబడ్దార్ అని దేగల మధుసూదన్ ఆత్మకూరు క్యాంపులోకి ఓ లేఖ విసిరాడు. ఈ చీటి చూసిన పోలీసులు ఇది విసిరింది దేగల మధుసూదన్ అని గుర్తించి అతని తల్లిదండ్రులను చిత్రహింసలు పెట్టారు. ఆయన అన్నదమ్ముల ఇళ్లను తగులబెట్టారు.



ఆత్మకూర్(ఎస్)లో అమరుల స్థూపాలు

ప్రాణాలొడ్డిన వల్లాల యోధులు


వల్లాలలో పది మంది పోరాటయోధులను రజాకార్లు కాల్చిచంపిన ప్రాంతం

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోకి 1948 సెప్టెంబర్ 15న ప్రవేశించిన రజాకార్లు మహిళల మానప్రాణాలను తీశారు. ఈ ఆకృత్యాలను చూసి తట్టుకోలేక రహస్య ప్రదేశంలో ఉన్న గ్రామానికి చెందిన ఏడుగురు యువకులు గద్దపాటి లచ్చయ్య, గుండ్లపల్లి రామయ్య అలియాస్ షేక్షింది రామయ్య, గుండ్లపల్లి మల్లయ్య అలియాస్ బుడింగ మల్లయ్య, గుండ్లపల్లి రామయ్య అలియాస్ తిమ్మిరి రామయ్య, చిట్టిప్రోలు శ్రీరంగం, గద్దపాటి బుచ్చయ్య అలియాస్ దుబ్బ బుచ్చయ్య, అనుముల శ్రీహరి 1948 సెప్టెంబర్ 16న గ్రామంలోకి వచ్చి నడిబొడ్డులో మువ్వన్నెల జాతీయజెండాను ఎగురవేశారు. రజాకార్లతో పోరాడి వారి చేతుల్లో ఉన్న తుపాకులను లాక్కొనే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆ ఏడుగురిని రజాకార్లు పట్టుకొని నాడు నిజాం నవాబు నిర్మించిన రెండు గదుల పాఠశాల (నేటి జెడ్పీ ఉన్నత పాఠశాల) ఆవరణలో ఉన్న మర్రిచెట్టుకు కట్టివేసి తుపాకులతో కాల్చిచంపారు. అనంతరం ఆ మృతదేహాలను పాఠశాల ఆవరణలోనే ఉన్న ఒక పూరిగుడిసెలో వేసి నిప్పుపెట్టి కాల్చిబూడిద చేశారు. అదేవిధంగా 1948 సెప్టెంబర్ 17న గ్రామంలో మరో ముగ్గురు తిరుగుబాటుదారులైన గద్దపాటి వెంకయ్య, గున్నాల రామయ్య, ఊట్కూరు గ్రామానికి చెందిన మంగళి (నాయీబ్రాహ్మణ) కులానికి చెందిన వ్యక్తిని రజాకార్లు పట్టుకొని కాల్చిచంపారు. ఈ సమయంలో గ్రామానికి చెందిన మహ్మద్ ఖాదర్ అనే వ్యక్తి ఎంతమందిని కాల్చి చంపుతారురా.. ముందు నన్ను చంపండిరా.. అంటూ ఎదిరించడంతో ఖాదర్ మాటలు విన్న గ్రామస్తులు ఇళ్లలోనుంచి బయటకు వచ్చి రజాకార్లకు ఎదురు తిరిగారు. దీంతో రజాకార్లు గ్రామం నుంచి వెళ్లిపోయారు.

నిజాంను ఎదిరించిన గడ్డ.. రావులపెంట


రావులపెంటలోని నాటి కోట బురుజు

మిర్యాలగూడ: నిజాం నవాబు, ఖాసీం రజ్వీ ఆగడాలు, భూస్వాములు, దొరలకు వ్యతిరేకంగా ఆయుధాలు పట్టి పోరాటం చేసిన వారిలో మిర్యాలగూడ మండలంలోని రావులపెంట యోధుల పాత్ర ప్రధానమైంది. గ్రామానికి చెందిన ఎంతోమంది పోరాట యోధులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బానిసత్వ సంకెళ్ల నుంచి తెలంగాణను విముక్తి చేయడానికి నరహంతక నిజాం తుపాకులకు ఎదురొడ్డి నేల కొరిగారు. అప్పట్లో తోపుచర్ల ఫిర్కాలోని రావులపెంట గ్రామం కేంద్రంగా పోరాటం సాగింది. నాడు నిజాం నవాబు తోపుచర్ల ఫిర్కాలోని గ్రామాల్లో అక్రమ శిస్తు వసూళ్లకు పాల్పడుతుండగా జనం తిరగబడ్డారు. ఆ పోరాటంలో రావులపెంట ప్రధాన కేంద్రంగా జనం.. నిజాం నవాబులకు ఎదురొడ్డారు. రావులపెంటలోని భూస్వామ్య కుటుంబంలో పుట్టిన చల్లా సీతారాంరెడ్డి నిజాం నవాబులను ఎదిరించేందుకు ఎన్నో క్యాంపులు నిర్వహించి వారి స్థావరాలపై దాడులు చేశారు. రావులపెంట కేంద్రంగా చల్లా సీతారాంరెడ్డితోపాటు నారబోయిన నర్సయ్య, గట్టికొప్పుల రాంరెడ్డి కలిసి మొదటిసారిగా రావులపెంటలో సభ నిర్వహించారు. అనంతరం పోరాట యోధులు కొందరు రజాకార్ల స్థావరంపై దాడి చేయడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. ఇందుకు అప్పట్లో గ్రామంలో నిర్మించిన కోట బురుజు నేటికీ చెక్కుచెదరకుండా పోరాట చరిత్రకు నెలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.

నిజాం సైన్యాలపై తిరగబడ్డ 'బాలెంల' బలగం

సూర్యాపేట: తెలంగాణ సాయుధ పోరాటం సమయంలో 1946లో అక్టోబర్ 18న ఉదయం 4గంటలకే నిజాం పోలీసులు బాలెంల గ్రామాన్ని చుట్టుముట్టారు. ఇది ముందే గ్రహించిన ప్రజలు వీధుల్లోకి వచ్చారు. పోలీసులను ఎదిరిస్తూ ముందడుగు వేసిన గార్లపాటి అనంతరెడ్డి, పటేల్ మట్టారెడ్డి, సుంకు రంగయ్య మరికొంత మందిపై పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టారు.


బాలెంల గ్రామంలోని ప్రధాన సెంటర్

క్షణాల్లోనే అదే తుపాకులను అందుకొని ఎదురు తిప్పారు. పోనీయక్.. పోనీయక్.. దొంగ పోలీసులు అనే కేకలతో వెనుక నుంచి వెంటాడుతున్న ప్రజలు వెనుతిరిగి చూసి నిజాం పోలీసులు అతికష్టం మీద కాల్పులు జరుపుకుంటూనే పరుగులంకించారు. పోలీసుల కాల్పుల్లో పటేల్ మట్టారెడ్డి, గార్లపాటి అనంతరెడ్డి అమరులయ్యారు. చాలామంది గాయపడ్డారు. బాలెంల రైతాంగం తిరుగుబాటు మొత్తం పాలకవర్గాన్నే గడగడలాడించింది. స్వయంగా ఈ ఘటనపైన విచారణ జరపాలని.. ఓదార్చాలని నైజాం చక్రవర్తి తన కుమారున్నే బాలెంలకు పంపడం ఈ ఘటన తీవ్రతకు సాక్ష్యం. అంతేకాదు మృతుల కుటుంబాలను పరామర్శించిన తర్వాత ఎక్స్‌గ్రేషియా చెల్లింపు పేరుతో అమరవీరుల కుటుంబ సభ్యులకు దోసిల్లతో పైసలు పోయడం బాలెంల రైతులు తిరుగుబాటుకు లభించిన నైతిక మద్దతు.

సద్దులు మోస్తున్నారని..

సూర్యాపేట: ఆత్మకూర్.ఎస్ మండల కేంద్రానికి చెందిన గునగంటి నర్సయ్య 22 సంవత్సరాల వయస్సులోనే దళంలో పనిచేస్తూ అత్యంత చాకచక్యంగా నిజాం ముష్కరులను ముప్పు తిప్పలు పెట్టేవాడు. ఆయనకు కొరియర్‌గా 13 ఏళ్ల వయస్సు గల గిలకత్తుల వెంకటయ్య పనిచేసేవాడు. చిన్న వయస్సులోనే వ్యవసాయ బావుల వద్దకు సద్దులు తీసుకుపోతున్నానంటూ దళాలకు అందించేవాడు. అనుకోకుండా వీరు ఇరువురు ఆత్మకూర్‌లోని ఒక ఇంట్లో రజాకార్లకు పట్టుబడ్డారు. వారిని నాటి పోలీస్ హెడ్‌క్వార్టర్ అయిన ఏనుబాములకు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టారు. తిరిగి ఆత్మకూర్‌కు తీసుకొచ్చి ఊరు బయట (నేడు స్థూపాలు ఉన్న చోట) వారిచేతనే గొయ్యి తీయించి అందులో నిలబెట్టి కాల్చి చంపారు. ఈ సంఘటన తెలంగాణ సాయుధ పోరాటంలో సంచలనం రేపింది.

దొరలతో కలబడి.. పేదల పక్షాన నిలబడి..


మరిపడిగలో గజ్జెల్లి మల్లయ్యను రజాకార్లు కట్టేసి కాల్చిచంపింది ఈ వేప చెట్టు వద్దే..

గుండాల: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గుండాల మండలానికి ప్రత్యేక చరిత్ర ఉంది. ఆంధ్ర మహాసభలో రావి నారాయణరెడ్డి పిలుపు మేరకు సుద్దాల హన్మంతు, దూదిపాల చిన్న నర్సిరెడ్డి, నీర్మాల కాచం కృష్ణమూర్తి, నల్ల నర్సింహులు వంటి వారు దళాలుగా ఏర్పడి గ్రామ గ్రామాన సమావేశాలు ఏర్పాటు చేసి నిజాం ఆకృత్యాలు, వెట్టిచాకిరీ, బలవంతపు శిస్తు వసూలుకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేశారు. సుద్దాల హన్మంతు తన ఆట, పాటలతో, వీధి నాటకాలు, బుర్ర కథలతో ప్రజలను చైతన్య పరిచారు. సుద్దాల గ్రామంలో పేద రైతు గుర్రం నర్సమ్మ, రాంరెడ్డిల చివరి సంతానమైన గుర్రం యాదగిరిరెడ్డి పదిహేనేళ్ల వయస్సులోనే సంఘం పిలుపును అందుకొని దళాలకు సమాచారం అందించారు. ఈ క్రమంలో చాలా గ్రామాల్లో కమ్యూనిస్టు దళాలు ఏర్పడ్డాయి. దళానికి నాయకత్వం వహించిన గంట పాపిరెడ్డిని వెల్మజాల, అనంతారం గ్రామాల మధ్యన నిజాం నిరంకుశ మూకలు తుపాకులతో కాల్చి చంపాయి. మరిపడిగ గ్రామంలోని గజ్జెల్లి మల్లయ్యను కచ్చీరు వద్దకు పిలిపించి తన రుమాలుతో వేప చెట్టుకు కట్టేసి తుపాకీతో కాల్చి చంపారు. గ్రామంలోని 20 ఇళ్లను తగులబెట్టారు. 1947 మే 20న సింగారం రాజయ్య, గాదె రాజు నల్లగొండ కోర్టుకు వెళ్లి తిరిగి వస్తుండగా మోత్కూరు వాగులో వారి చేతనే బొంద తీయించి అందులో నిలబెట్టి భుజాల వరకు పూడ్చి తుపాకీతో కాల్చి చంపారు. గుండాల మండల కేంద్రానికి చెందిన కాచం కొండయ్య గబ్బెటలోని రేగడినేలలో సొప్పగూట్లో దాగి ఉండగా రజాకార్లు అతడిని బంధించి బిక్కేరులో బొంద తీయించి అందులో పాతి పెట్టి కాల్చి చంపారు. అలాగే గుక్క విశ్వనాథంను చెట్టుకు కట్టేసి కాల్చి చంపారు. కాచం కృష్ణమూర్తితోపాటు పెద్దపడిశాల గ్రామంలో పోతరబోయిన మీనయ్య.. వస్తాకొండూర్, అడ్డగూడూరు, బొడ్డుగూడెం, బుజిలాపురం గ్రామాల్లోని దొరలకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి గ్రామంలోని దొర వెంకట్‌రెడ్డి భూములతోపాటు నల్లకుంట, పీకలగడ్డ గ్రామంలోని భూములను పేదలకు పంచారు. పోరాటంలో మహ్మద్ ఖాసీమ్‌ను దొరల గడీ ముందు వేప చెట్టుకు కట్టివేసి రజాకార్లు కాల్చి చంపారు. ఆకుల సీతయ్యను కాల్చగా పక్కనే ఉన్న ఏటి కాల్వలో పడి తప్పించుకున్నారు. నేటికీ ఆయా గ్రామాల్లో దొరలకు వ్యతిరేకంగా పోరాడిన ఆనవాళ్లు చరిత్రకు సాక్ష్యంగా నిలిశాయి.

పోరాటాల గడ్డ.. కొత్తగూడెం

తుంగతుర్తి: సాయుధ పోరాటంలో తుంగతుర్తి మండలం కొత్తగూడెం ప్రముఖ ప్రాతను పోషించింది. ఈ పోరాటంలో దివంగత నేత కామ్రేడ్ భీంరెడ్డి నర్సింహారెడ్డి.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో కీలక పాత్ర పోషించారు. సాయుధ పోరాటంలో భాగంగా తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌పై దాడి చేస్తున్న క్రమంలో కొత్తగూడెం గ్రామానికి చెందిన మల్లెపాక మైసయ్య పోలీసుల కాల్పుల్లో అమరుడయ్యారు. పోరాట యోధుల్లో మాజీ ఎంపీ దివంగత నేత భీంరెడ్డి నర్సింహారెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం, కొండల్‌రెడ్డి, వెంపటి గ్రామానికి చెందిన దాయం రాజిరెడ్డిలది ప్రత్యేక స్థానం. నాడు ఈ ప్రాంత ప్రజలు ఎన్నో కష్టాలకు ఓర్చి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడారు. భీంరెడ్డి నర్సింహారెడ్డి తన తుదిశ్వాస వరకు శ్రీరాంసాగర్ నీటిని తేవడానికి కృషి చేశారు. ఆయన కృషి ఫలితంగానే నేడు తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాలు ఎస్సారెస్పీ నీటితో సస్యశ్యామలంగా మారాయి.


కొత్తగూడెం గ్రామ వ్యూ

ఎర్రపహాడ్ గడీపై దాడి


ఎర్రపహాడ్‌లోని జెన్నారెడ్డి దేశ్‌ముఖ్‌ల గడీ

నూతనకల్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం నిజాం, దేశ్‌ముఖ్‌లు, భూస్వాముల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం మహోజ్వలంగా కొనసాగింది. దేశ్‌ముఖ్‌ల నుంచి పల్లెలను విముక్తి చేసేందుకు కమ్యూనిస్టులు గెరిల్లా పంథాలో తమ పోరాటం సాగించారు. రాష్ట్రంలోనే లక్షా 50వేల ఎకరాలకు అధిపతి అయిన జెన్నారెడ్డి ప్రతాప్‌రెడ్డి దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా నూతనకల్ మండలంలో సాయుధ పోరాటం ఉవ్వెత్తున ఎగిసిపడింది. 1948లో భీంరెడ్డి కొండల్‌రెడ్డి, గాయం రాజిరెడ్డిల నేతృత్వంలో వందలాది మంది కమ్యూనిస్టులు ఎర్రపహాడ్ గడీపై దాడి చేశారు. ఈ క్రమంలో కమ్యూనిస్టు దళాలు విసిరిన బాంబు ఎత్తయిన గడీ గోడకు తగిలి కమ్యూనిస్టుల గుంపులో పడడంతో చిల్పకుంట్ల గ్రామానికి చెందిన బత్తుల వెంకన్న అమరుడయ్యాడు. దీంతో రజాకార్లు కాల్పులు జరపగా కమ్యూనిస్టు గెరిల్లా దళాలు తప్పించుకున్నాయి.

చరిత్రకెక్కని పాతర్లపహాడ్ అమరుల ఘటన


గాయాలతో బయటపడిన జటంగి నర్సయ్య (ఫైల్)


యూనియన్ సైన్యం కాల్పుల్లో చనిపోయిన కట్టా పాపయ్య (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్): పాతర్లపహాడ్ గ్రామంలో నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో 12-9-1949న ఒకేసారి 18 మంది దళసభ్యులను ఖాసీంరిజ్వీ సైన్యం కాల్చిచంపింది. మంచినీళ్ల బావి ఘటనగా గ్రామంలో చెప్పుకునే ఈ ఘటన ఇప్పటి వరకు చరిత్రకు ఎక్కలేదు. గ్రామానికే చెందిన కొందరు ఇన్‌ఫార్మర్లు రిజ్వీ సైన్యానికి ఇచ్చిన సమాచారంతో ఓ తోటలో సమావేశమైన సుమారు 20 మంది కందగట్ల గ్రామానికి చెందిన భూతం పర్వతాలు, గోరెంట్లకు చెందిన పులుసు మల్లయ్య, పాతర్లపహాడ్‌కు చెందిన పాండవుల భద్రయ్య, పాండవుల రాములు, పాపయ్య, బోయిళ్ల బలరామ్, మేరె యల్లయ్య, కొంగల బసవయ్య, శనగాల పెంటయ్య, పోగుల వీరయ్య, తంగెళ్ల గోపాల్‌రెడ్డి, దొంతగాని పాపయ్య, తండు పాపయ్య, పల్స రాములు, బత్తిని రామస్వామి, కాకి జానకిరెడ్డి, పబ్బతి భిక్షం గౌడ్, భూతం కొమరయ్య, జటంగి నర్సయ్య, మరో వ్యక్తిని చుట్టుముట్టిన రజాకార్లు పట్టుకుని గ్రామంలోని మంచినీళ్ల బావి వద్ద వరుసగా కట్టేశారు. ఒకరి తర్వాత ఒకరిగా కాల్చారు. ఈ సమయంలో జటంగి నర్సయ్య గాయాలతో బయటపడ్డాడు. నాలుగేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతిచెందాడు. మరో వ్యక్తి తప్పించుకుని పారిపోయినట్లు తెలుస్తోంది. కట్టా పాపయ్య, నర్సయ్యలను ఏపూరు క్యాంపులకు తీసుకెళ్లి కాల్చిచంపినట్లుగా గ్రామస్తులు పేర్కొంటున్నారు. సాయుధ పోరాటంలో ఒక్క పాతర్లపహాడ్ గ్రామంలోనే వరుస ఘటనలు జరగడానికి ప్రధాన కారణంగా ఈ గ్రామం సాయుధ పోరాట గెరిల్లా దళాలకు శిక్షణ కేంద్రం కావడమే. మంచినీళ్ల బావి ఘటనలో అమరులైన 18 మందికి గ్రామ శివారులోని ఓ ప్రాంతంలో అప్పట్లో నిర్మించిన స్మారక స్థూపం ప్రస్తుతం శిథిలావస్థలో కంపచెట్ల మధ్యలో ఉన్నది.

యువకుడు అదృశ్యం

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని దివీస్ ఫార్మా కంపెనీకి చెందిన హాస్టల్ నుంచి యువకుడు అదృశ్యమయ్యాడు. శనివారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన రణంకి లక్ష్మణ్‌రావు(26) చౌటుప్పల్ మున్సిపాలిటీ సమీపంలోని దివీస్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. అక్కడే కంపెనీ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 14న బయటకు వెళ్లిన లక్ష్మణ్‌రావు తిరిగి రాలేదు. సహచరులు అతడి కోసం స్థానికంగా ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. లక్ష్మణ్‌రావు సోదరుడు కార్తీక్ శనివారం చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మిర్యాలగూడలో మహిళ..


సైదమ్మ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మహిళ అదృశ్యమైంది. శనివారం మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాల్వాయి సైదమ్మ ఈ నెల 12న భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సైదమ్మ కుమార్తె అనూష పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదాద్రిలో శాసనమండలి విప్ పూజలు


ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడిని తెలంగాణ శాసనమండలి విప్, ఎమ్మెల్సీ ఎంఎస్. ప్రభాకర్‌రావు శనివారం దర్శించుకున్నారు. ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా.. ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు


ఘటనా స్థలంలో గాయపడిన ప్రభాకర్

మునగాల(కోదాడ): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మునగాల మండలంలోని మాధవరం గ్రామ శివారులో నేలమర్రి క్రాస్ రోడ్డు వద్ద శనివారం విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నేలమర్రి గ్రామానికి చెందిన కొలకపంగు ప్రభాకర్ శనివారం బైక్‌పై చివ్వెంల మండలంలోని గుంపుల గ్రామంలో శుభకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో మాధవరం గ్రామ శివారులోకి రాగానే వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం అతివేగంగా వచ్చి ప్రభాకర్ బైక్‌ను ఢీకొట్టడంతో అతడి ప్రభాకర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మునగాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లం, పటిక పట్టివేత

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండల కేంద్రంలోని పలు దుకాణాలపై శనివారం జనగామ జిల్లా కొడకండ్ల పోలీసులు దాడులు చేసి 40 బస్తాల బెల్లం, 100 కిలోల పటికను పట్టుకున్నారు. ఈ సందర్భంగా కొడకండ్ల ఎస్ఐ శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. కొడకండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బెల్లం వ్యాపారులు పట్టుబడటంతో వారు ఇచ్చిన సమాచారం మేరకు తిరుమలగిరిలోని కిరాణం షాపుపై దాడులు చేసి బెల్లం, పటికను పట్టుకున్నట్లు తెలిపారు. కిరాణం షాపు యజమాని తాళం వేసి పరారైనట్లు పేర్కొన్నారు. కాగా కొద్దిరోజులుగా తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో కొంతమంది అధికారుల అండతో నల్లబెల్లం, పటిక అమ్ముతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తిరుమలగిరి మండలంలోని అన్ని గ్రామాల్లో గుడుంబా తయారీ జోరుగా సాగుతోందని, అధికారులు స్పందించి గుడుంబా తయారీని అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు



భువనగిరిలో పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న విద్యార్థులు



స్కేటింగ్ పోటీలలో విద్యార్థుల విన్యాసాలు